
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY 1



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

ఆదివారం 15 జూన్ 2025

తెరపైకి కొత్త మండలాలు

- ప్రతిపాదనలో తూడుకుర్తి, ఐతోల్, మంగనూరు - నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో కదులుతున్న పావులు

నాగర్‌కర్నూల్ జిల్లాలో కొత్త మండలాలు ఏర్పడనున్నాయని ప్రచారం జోరుగా జరుగుతోంది. డీలిమిటేషన్ రిజర్వేషన్లు కూడా మారనున్న క్రమంలో భవిష్యత్తు రాజకీయాలపై నాయకులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో అనేక మార్పులకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గం కేంద్ర బిందువుగా మారనుంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగే క్రమంలో పెబ్బేరు లేదా బిజినేపల్లి కొత్త నియోజకవర్గాలుగా ఏర్పడతాయనే ప్రచారం జరుగుతోంది. అచ్చంపేట నియోజకవర్గం జనరల్ కేటగిరికి కేటాయిస్తారని, నాగర్‌కర్నూల్ నియోజవకర్గాన్ని ఎస్సీలకు రిజర్వ్ చేస్తారనే క్రమంలో బిజినేపల్లి కొత్త నియోజకవర్గంగా ఏర్పడుతుందనే క్రమంలో అనేక పరిణామాలు చోటు చేసుకోనున్నాయి.

2

- నాగర్‌కర్నూల్, ఆంధ్రజ్యోతి

ప్రైవేట్ దోపిడీ

సంపాదనే ధ్యేయంగా విద్యాసంస్థల తీరు

- గత ఏడాది కంటే ఈ సారి ఫీజులు 20 శాతం పెంపు
- అడ్మిషన్ ఫీజు రూ.1000 నుంచి రూ.3,500లకు
- స్కూళ్లలో పాఠ్య, నోట్ పుస్తకాలు, షూ, టై, బెల్టుల విక్రయం
- విద్యాశాఖ నిబంధనలు పాటించని యాజమాన్యాలు

2

ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. నిబంధనలను ఉల్లంఘించి తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. తమ స్కూల్‌లో మంచి ర్యాంకులు వస్తున్నాయని, నాణ్యమైన విద్య అందిస్తున్నామని, నమ్మించి నట్టేట ముంచుతున్నాయి. ఈ ఏడాది గతంకంటే ఏకంగా 20 శాతం ఫీజులు పెంచడంతో విద్యార్థుల పేరెంట్స్ ఆందోళనకు గురవుతున్నారు.

- మహబూబ్‌నగర్ విద్యావిభాగం

నల్లమలను సంరక్షించాలి

- అటవీ అధికారులను ఆదేశించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



కొల్లాపూర్‌లో అటవీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ నల్లమల అటవిని సంరక్షించాలని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అటవీ అధికారులను ఆదేశించారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద జిల్లా అటవీ అధికారి డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, అటవీ సిబ్బందితో మంత్రి జూపల్లి సమావేశం అయ్యారు. కొల్లాపూర్ నల్లమల పరిధిలో కొత్తగా అడవిని కొట్టకుండా సంరక్షించాలని ఆదేశించారు. 2005 సంవత్సరానికి ముందు ప్రభుత్వపరంగా అటవీ హక్కు పత్రాలు వచ్చిన రైతులు వ్యవసాయం చేసుకోవచ్చని, ఇంకా అటవీ హక్కు పత్రాలు రాని రైతులను గుర్తించాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. నల్లమల శివారు గ్రామాలకు అటవీప్రాంతానికి మధ్య ట్రెంచ్ ఏర్పాటు చేసి అటవీ భూమిని పరిరక్షించాలని ఆదేశించారు. అనంతరం కొల్లాపూర్ మండలంలోని మొలచింతపల్లి, నార్లాపూర్, ముక్కిడిగుండం గ్రామాల రైతులు నాయకులు తమకు అటవీశాఖ అధికారుల నుంచి ఎదురవుతున్నా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో రేంజర్ చంద్రశేఖర్, సెక్షన్ ఆఫీసర్ ఎండీ ముజీబ్ గోరి, బీట్ ఆఫీసర్లు, అటవీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీ మల్లురవి

తాడూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో భూ భారతి చట్టాన్ని ఆవిష్కరించామని ఎంపీ మల్లురవి అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని గుట్టలపల్లి, పొల్మూరు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే పాలనలో రేవంత్‌రెడ్డి తనదైన ప్రత్యేక ముద్రవేస్తూ బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ న్యాయం చేకూరే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రధానంగా పేదలకు సన్న బియ్యం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతుభరోసా, రుణ మాఫీ, గృహజ్యోతి వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణు వర్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అమరేందర్, తహసీల్దార్, ఆర్డీవో తదితరులు ఉన్నారు.

పర్యాటకులకు కనువిందు

- నల్లమలలో కనిపించిన 4 చిరుతలు, ఒక పెద్దపులి



నల్లమలలోని గుండం అటవీ ప్రాంతంలో రోడ్డుపై చిరుత సంచారం

3

నీట్ యూజీ ఫలితాల్లో
వాగ్దేవి అద్భుత విజయం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ యూజీ 2025 పరీక్ష ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. కళాశాలకు చెందిన 85 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 38 మంది మెడికల్ సీట్లు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు నీట్‌లో మంచి ర్యాంకులు సాధించి సత్తా చాటారన్నారు. కళాశాలలో వన్ క్లాస్ ఇన్నోవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్‌తో నాణ్యమైన విద్యను అందించి జాతీయ స్థాయిలో మేము సైతం అంటూ విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతినందన్‌రెడ్డి, అకాడమీ అడ్వైజర్ యాకుబ్, ఎంసెట్ ఇన్‌చార్జి చెన్నయ్య, యాజమాన్య సభ్యులు కోల్ల శివకుమార్, సతీష్ రెడ్డి, నాగేందర్, రాఘవేందర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ కళాశాల గౌరవ సలహాదారులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు నీట్ 2025 ఫలితాల్లో దూకుడు ప్రదర్శించారు. శనివారం విడుదలైనా నీట్ ఫలితాల్లో ప్రతిభ నీట్ అకాడమీ విద్యార్థులు మంజు 593 మార్కులు, ఎండీ డానిష్ 544 మార్కులు, మధుకుమార్ 527 మార్కులు, హఫ్సాఫాతిమా 517 మార్కులు, మారెమ్మ 501 మార్కులు, భీమేశ్వరి 480, సుప్రజ 477, ముజాహిద్ 473, భావన 469, జశ్వంత్ 462, తన్మయి 461, ఐశ్వర్య 452, అరుణ్ 447, మెహరాజ్ 446, ప్రణవ్ సాయి 441, నౌషిన్ సుల్తానా 441, కె.గణేష్ 437, అకెజ అంజుమ్ 435, శ్రీచందన 432, సిద్దికానౌషిన్ 431 , షాగుఫ్తనాజ్ 426, రహూల్ 426, స్ఫూర్తిరెడ్డి 422, యు.శ్రుతి 420, జి.ప్రణీత 418 మార్కులు సాధించి సత్తా చాటారు. నీట్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల గౌరవ సలహాదారులు కె.మంజుల దేవి, వి.లక్ష్మారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.జనార్ధన్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



మంజు మార్కులు 593,



ఎండీ దానిష్ మార్కులు 544,



మధుకుమార్ మార్కులు 527



హఫ్సాఫాతిమా మార్కులు 517

రిషి విజయభేరి



విద్యార్థులను అభినందింస్తున్న రిషి కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళ వెంకట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నీట్ 2025 పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రలోని రిషి కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి సత్తా చాటారు. వందకు పైగా మెడికల్ సీట్లు కళాశాల విద్యార్థులకు రానున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళ వెంకట్, ఛీఫ్ అకాడమీక్ అడ్వైజర్ వెంకటయ్యలు తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కళాశాలకు చెందిన విద్యార్థులు తరుణ్ సాయి 550 మార్కులు, స్వర్ణకుమారి 545 మార్కులు, వినయ్ 555 మార్కులు సాధిచారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ భూపాల్‌రెడ్డి, అకడామిక్ డీన్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్నకుమారి, రాఘవేందర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్ కావాలన్న లక్ష్యంతో కష్టపడి చదివా



డాక్టర్ కావాలన్న లక్ష్యంతో కష్టపడి చదివాను. అందుకు కళాశాల అధ్యాపకుల సహకారం, వారి ప్రోత్సాహం ఎంతగానో ఉంది. రోజూ 14 గంటలు చదివాను. ఈ ర్యాంకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది.

- తరుణ్ సాయి

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇష్టపడి చదివా



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇష్టపడి చదివి మొదటి ప్రయత్నంలోనే 545 మార్కులు సాధించా. ఇందుకు కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం తనను ఎంతగానో ప్రోత్సహించారు. అధ్యాపకులు ఏ చిన్న డౌట్ వచ్చినా తీర్చేవారు.

- స్వర్ణకుమారి (545 మార్కులు)

శారీరక దృఢత్వం అవసరం

- పీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్
- ముగిసిన టీజీ పీఈసెట్ ఎంపికలు
- నాల్గో రోజు 566 మందికి గాను 397 మంది విద్యార్థులు హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మానసిక దృఢత్వంతో పాటు శారీరక దృఢత్వం అవసరమని పీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. పీయూలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న టీజీ పీఈసెట్ ఎంపికలు శనివారం ముగిశాయి. జేఎన్‌టీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వై గోపి కృష్ణ, టీజీ పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్, రిజిస్ట్రార్ రమేష్ బాబుతో కలిసి వీసీ ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను కెరీర్‌గా ఎంచుకున్నవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. నాలుగు రోజులుగా ఎంపికలు పారదర్శకంగా నిర్వహించారని చెప్పారు. పీయూ అధికారులను, కమిటీ సభ్యులను అభినందించారు


856 మంది గైర్హాజరు

నాల్గో రోజు బీపీఎడ్ కోర్సుకు సంబంధించి 418 మంది విద్యార్థులకుగాను 311 మంది హాజరు కాగా, 101 మంది గైర్హాజరయ్యారని టీజీ పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీపీఎడ్ కోర్సుకు సంబంధించి 154 మంది విద్యార్థులకు గాను 86 మంది హాజరు కాగా 68 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

'ప్రైవేట్' దోపిడీ



- సంపాదనే ధ్యేయంగా ప్రైవేట్ విద్యాసంస్థలు
- గత ఏడాది కంటే ఈ సారి ఫీజులు 20 శాతం పెంపు
- విద్యాశాఖ నిబంధనలు పాటించని యాజమాన్యాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,325 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లా కేంద్రాలతో పాటు జడ్చర్ల, కల్వకుర్తి, అలంపూర్, అచ్చంపేట, దేవరకద్ర, మక్తల్ తదితర పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. తమ పాఠశాల విద్యార్థులు ఇన్ని మార్కులు తెచ్చుకున్నారు.. అన్ని మార్కులు తెచ్చుకున్నారంటూ విద్యార్థుల ఫొటోలు, మార్కులతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పట్టణాలు, గ్రామాల్లో రంగురంగుల ఫొటోలతో పెద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కొన్ని పాఠశాల ఫీజ వివరాలు ఇలా(రూ.ల్లో)

తరగతి	ట్యూషన్	అడ్మిషన్	పుస్తకాలు
ఎల్‌కేజీ, యూకేజీ	28,500	2,500	5,850
1, 2	30,500	2,500	6,300
3, 4	35,500	2,500	7,300
6	45,500	2,800	7,500
7	50,500	3,000	7,850
8	53,500	3,000	8,200
9	55,500	3,000	8,750
10	65,500	3,500	10,500

తల్లిదండ్రుల కమిటీలేవీ?

విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఆయా పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులు, పోషకులతో కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఫీజులపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఏ ప్రైవేట్ పాఠశాలలోనూ తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేయలేదు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే యాజమాన్యాలే ఫీజులను నిర్ణయిస్తున్నాయి. అలాగే ఈ ఏడాది అడ్మిషన్, ట్యూషన్‌తో పాటు, పుస్తకాలు, యూనిఫామ్స్, షూ, టై, బెల్టు తదితరాల పేరుతో గత ఏడాది కంటే 20 శాతం ఫీజులు పెంచాయి. అడ్మిషన్ ఫీజు గత ఏడాది రూ.1000 ఉంటే, ఈ ఏడాది పాఠశాల స్థాయిని బట్టి రూ. 2000 నుంచి రూ. 3500 వరకు పెంచాయి. పుస్తకాల ధరలు కూడా గణనీయంగా పెంచేశాయి. ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటి, రెండు, మూడవ తరగతుల పుస్తకాలకు రూ.4,500 నుంచి రూ.6,500 వసూలు చేస్తున్నారు. నాలుగు, ఐదు తరగతులకు రూ.5000 నుంచి రూ.7,500 తీసుకుంటున్నారు. 6 నుంచి 9వ తరగతి వరకు రూ.8,500, పదవ తరగతి పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌కు రూ. 9,500 నుంచి రూ.11,000 వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పాఠ్య, నోట్ పుస్తకాలు, షూ, టై, బెల్టులు విక్రయించొద్దని విద్యాశాఖ నిబంధనలున్నాయి. కానీ ఈ నిబంధనను యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా వాటిని విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు దండుకుంటున్నాయి.

పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు కమిటీలను ఏర్పాటు చేయలేదు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు కూడా నిర్వహించడం లేదు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో డీఈవోలు, ఎంఈవోలు సమావేశం కూడా నిర్వహించ లేదు. కనీసం ఎంత ఫీజులు వసూలు చేస్తున్నారో తెలుసుకునేందుకు పాఠశాలలను తనిఖీ చేసిన దాఖలాలు కూడా లేవన్న విమర్శలున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు పూర్తయ్యాయి. కొందరు తల్లిదండ్రులు ఫలానా పాఠశాలలో అడ్మిషన్ కావాలంటూ విద్యాశాఖ అధికారులను కోరితే వారే సిఫారసు చేసి, సీట్లు ఇప్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిల్లో ఫీజుల నియంత్రణ ఎలా సాధ్యం అవుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెరపైకి
కొత్త మండలాలు

నాగర్‌కర్నూల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గాల పునర్విభజన జరగబోతున్న నేపథ్యంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కొత్త మండలాల ప్రతిపాదన తెరపైకి వస్తున్నది. డీలిమిటేషన్‌లో రిజర్వేషన్లు కూడా మారనున్న క్రమంలో భవిష్యత్తు రాజకీయాలపై అధికార పార్టీ నేతలు దృష్టి సారించారు. ఈ క్రమంలో అనేక మార్పులకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గం కేంద్ర బిందువుగా మారనుంది. ఈ అంశం ప్రధాన రాజకీయ పార్టీల నేతల అంతరంగిక సమావేశాల్లో ప్రధానంగా చర్చకు వస్తోంది.

జోరందుకున్న ప్రచారం..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో మూడు కొత్త మండలాలు ఏర్పడనున్నాయనే ప్రచారం బలంగా కొనసాగుతుంది. ఇందుకు సంబంధించి అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు కూడా వెళ్లాయనే ప్రచారం జోరందుకుంది. ప్రస్తుతం నియోజకవర్గంలో నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, తాడూరు, తెలకపల్లి మండలాలు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 2లక్షల 13వేల పైచిలుకు ఉండగా నాగర్‌కర్నూల్ మండలం మినాహాయించి బిజినేపల్లి మండలం విస్తీర్ణం, జనాభా ప్రాతిపదికన పెద్ద మండలంగా ఉంది. 265.97 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం కలిగి ఉన్న బిజినేపల్లి మండలంలో 72వేల 607 జనాభా ఉంది. ఇందులో 70వేలు మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగే క్రమంలో పెబ్బేరు లేదా బిజినేపల్లి కొత్త నియోజకవర్గాలుగా ఏర్పడుతాయనే ప్రచారం విస్తృతంగా కొనసాగుతుంది. అచ్చంపేట నియోజకవర్గం జనరల్ కేటగిరికి కేటాయిస్తారని, నాగర్‌కర్నూల్ నియోజవకర్గాన్ని ఎస్సీలకు రిజర్వ్ చేస్తారనే క్రమంలో బిజినేపల్లి కొత్త నియోజకవర్గంగా ఏర్పడుతుందనే క్రమంలో అనేక పరిణామాలు చోటు చేసుకోనున్నాయి. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి సొంత గ్రామమైన తూడుకుర్తిని కొత్త మండలంగా ఎంపిక చేసి అందులో శ్రీపురం, బొందలపల్లి, సల్కర్‌పేట గ్రామాలను చేర్చాలనే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా అతిపెద్ద మండలంగా ఉన్న బిజినేపల్లిని రెండు భాగాలుగా చేస్తూ ప్రతిపాదనలు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. దాదాపు 72వేల జనాభా ఉన్న బిజినేపల్లిలో మంగనూరును రెండో మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. లట్టుపల్లి, గౌరారం, వెల్గొండ, శాయిన్‌పల్లి గ్రామాలతోపాటు గంగారం కూడా మంగనూర్‌లో చేర్చి కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజల అభిమతంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగి బిజినేపల్లి కొత్త నియోజకవర్గంగా ఏర్పడితే తూడుకుర్తి, మంగనూరు, తిమ్మాజిపేట, బిజినేపల్లి మండలాలను కలిపే యోచన ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో అంచనాలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో అతి పెద్ద గ్రామమైన తాడూరు మండలంలోని ఐతోల్‌ను కూడా మండల కేంద్రంగా చేయాలనే ప్రతిపాదన గత పదేళ్ల నుంచి ఆ గ్రామ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. తాడూరు మండలంలో యాదిరెడ్డిపల్లి, వెంకటాపూర్, మేడిపూర్, నెల్లికుదురు గ్రామాలు ఐతోల్ మండల కేంద్రంగా ఏర్పడితే గోవిందాయపల్లి, పాపగల్, భలాన్‌పల్లి, ఇంద్రకల్ గ్రామాలతోపాటు తాండాలను ఇందులో చేర్చాలనే యోచన ఉన్నట్లు కూడా విశ్వసనీయ సమాచారం.

పునర్విభజన రాజకీయాల వైపు నేతల అడుగులు..

నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగనున్న నేపథ్యంలో ప్రధాన, ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. రిజర్వేషన్ ఏమవుతుందో ఏ మండలం ఎక్కడికి చేరుతుందో తెలియక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజన గురించి తాము అయోమయానికి గురవుతున్న పరిస్థితిని ఓటర్లకు తెలియనివ్వకుండా జాగ్రత్తపడుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలతో సత్సంబంధాలు నేర్పుతున్నారు. మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుంది, రిజర్వేషన్లు ఎలా తారుమారు అవుతాయో తెలియని జనం ప్రధాన పార్టీల నేతలకు హారతి పడుతూనే గోప్యతను ప్రదర్శిస్తుండడం గమనార్హం.

జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు
కొనసాగుతున్న వరద

ధరూరు/దోమలపెంట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన నీటి ప్రాజెక్టులైన శ్రీశైలం, జూరాలకు స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల వరద నీరు కొనసాగుతోంది. శనివారం కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయంలో 64.69 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, నారాయణపూర్ జలాశయంలో 32.86 టీఎంసీల నీరు ఉన్నది. జూరాల జలాశయంలో 317.600 మీటర్లలో 4.129 టీఎంసీల నీరు ఉన్నది. ప్రాజెక్టుకు 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, జెన్‌కో జలవిద్యుత్ కేంద్రానికి 35,016 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 260 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 1500 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 315 క్యూసెక్కులతో మొత్తం జూరాల ప్రాజెక్టు నుంచి 36,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు.

జూరాల ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పాదన 35,016 ద్వారా క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుంచి 6,560 క్యూసెక్కులతో మొత్తంగా 41,576 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుండగా శ్రీశైలం ప్రాజెక్టులో 30,092 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడగులకు గాను, 838.10 అడుగుల్లో 215.807 టీఎంసీల సామర్థ్యానికి గాను 59.0461 టీఎంసీల నీటి నిల్వలు నమోదవుతున్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల వ్యవధిలో కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో 308 క్యూసెక్కుల నీటిని వినియోగించి 0.185 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 5,518 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 2.586 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించగా, ఎంజీకేఎల్ఐ కాల్వకు నీటి మళ్లింపును నిలిపివేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 6,019 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పాదనతో సాగర్‌కు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

ఖరీఫ్‌కు మించి..
రబీలో ధాన్యం సేకరణ

- మొత్తం 96,199 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- బోనస్ ప్రకటనతో మారిన రైతుల సాగు తీరు
- సన్నది 91,699, దొడ్డురకం 4,530 మెట్రిక్ టన్నులు
- రూ.209.83కోట్లకు గాను చెల్లించింది రూ.189.38 కోట్లు
- గత ఖరీఫ్‌లో 67వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ



జమ్మిచేడు కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా వేస్తున్న దృశ్యం(ఫైల్)



కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

గద్వాల జూన్ 14 (ఆంధ్రజ్యోతి) గద్వాల జిల్లాలో ఏరువాకతో ధాన్యం సేకరణ ముగిసింది. జిల్లాలో మునిపెన్నడూ కొనుగోలు చేయని విధంగా ధాన్యం సేకరణ జరిగింది. ఖరీఫ్‌లో 67వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగితే ఇప్పుడు రబీలో దానిని మించి 96,199 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. గత ఏడాది రబీలో 3,038మెట్రిక్ టన్నుల దొడ్డు రకం మాత్రమే కొనుగోలు చేశారు. ఇప్పుడు దానికి 30రెట్లు అధిక ధాన్యం సేకరించారు. ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు సన్నాల సాగువైపు మొగ్గు చూపారు. యాసంగిలో నీటి ఎద్దడి ఉంటుందని తెలిసిన రైతులు మాత్రమే సన్నాలనే పండించారు.

జిల్లాలో ముగిసిన ధాన్యం సేకరణ

జోగుళాంబ గద్వాల జిల్లాలో దాన్యం సేకరణ ఏరువాకతో ముగిసింది. జిల్లాలో 68.896 ఎకరాలలో వరిని సాగు చేశారు. ఇందుకోసం సివిల్ సప్లయ్ అధికారులు 75 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఐకేపీ 57, మెప్మా 5, పీఏసీఎస్ 13 సెంటర్లను ప్రారంభించి ధాన్యం సేకరించింది. మొదట మందకొడిగా ధాన్యం సేకరణ జరిగినా అకాల వర్షాల రాకతో కొనుగోళ్లలో వేగం పెంచారు. కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, సివిల్ సప్లయ్ డీఎం విమల ఎప్పటికప్పుడు కేంద్రాలను సందర్శించి ధాన్యం సేకరణ వేగవంతంతో పాటు కొన్న ధాన్యంను ఎప్పటికప్పుడు లారీలలో మిల్లులకు తరలించారు. మొత్తం 15,147మంది రైతుల నుంచి 96,199 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో సన్నరకం 91,669మెట్రిక్ టన్నులు కాగా దొడ్డు రకం 4,530 మెట్రిక్ టన్నులు ఉంది.

రూ.209 కోట్లకు గాను చెల్లించింది రూ.189 కోట్లు

కాగా మొత్తం 15,147 మంది రైతుల నుంచి 96,199 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, రూ. 209.10 కోట్లను చెల్లించాల్సి ఉంది. కానీ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఇప్పటి వరకు 81,633 మెట్రిక్ టన్నులకు మాత్రమే ఆన్‌లైన్ ఎంట్రీలు చేయడంతో 12,788 మంది రైతులకు రూ.189.38కోట్లను చెల్లించారు. ఇంకా 2,359 మంది రైతులకు రూ.19.72కోట్లను చెల్లించాల్సి ఉంది. రెండు రోజులలో ఆన్‌లైన్ ఎంట్రీలు పూర్తయి రైతుల ఖాతాలలో డబ్బులు జమ అవుతాయని అధికారులు తెలిపారు. ఇందుకోసం కేంద్రం నిర్వాహకులను కూర్చోబెట్టి ఆన్‌లైన్ ఎంట్రీలను చేయిస్తున్నారు.

బోనస్ ప్రకటనతో పెరిగిన సన్నాల సాగు

జిల్లాలో యాసంగిలో ఎక్కువగా దొడ్డురకం ధాన్యంను రైతులు పండించే వారు. దీనికి కారణం నీటి ఎద్దడితో పాటు తక్కువ సమయంలో కోతకు రావడం. గతే ఏడాది యాసంగిలో ప్రభుత్వం 3,038 మెట్రిక్ టన్నులను మాత్రమే సేకరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్‌ప్రకటించడంతో యాసంగిలో కూడా రైతులు సన్న రకం సాగును చేశారు. ఖరీఫ్‌లో 67వేల మెట్రిక్ టన్నులను మాత్రమే సేకరించగా ఇప్పుడు రబీలో 91,699 మెట్రిక్ టన్నులను సేకరించారంటే రైతులు సన్నాల సాగుకు ఎంతమేర మొగ్గు చూపారో తెలుస్తుంది. ఖరీఫ్‌లో రూ.33.86కోట్ల బోనస్‌ను రైతులు పొందారు. ఇప్పుడు రబీలో దాదాపు రూ. 45.83కోట్ల బోనస్‌ను పొందే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వం ఇంకా బోనస్‌ను రైతుల ఖాతాలలో జమ చేయలేదు.


పూర్తిచేసి రైతులకు న్యాయం చేశాం



జిల్లాలో రైతులు పండించిన ధాన్యం అంతా సేకరించి పూర్తి చేశాం. గత ఖరీఫ్ కంటే ఎక్కువ ధాన్యం వచ్చింది. అకాల వర్షం వలన కొంత ఇబ్బంది అయినా కొనుగోళ్లను పెంచాం. అంతేస్థాయిలో లారీల సంఖ్యను పెంచి మిల్లులకు తరలించాం. అదేవిధంగా ఆన్‌లైన్ ఎంట్రీలను పూర్తిచేసి రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేశాం. ఇంకా రెండు మూడు రోజులలో మొత్తం డబ్బులు రైతుల ఖాతాలలో వేసి పూర్తి చేస్తాం.

- విమల,
డీఎం సివిల్ సప్లయ్ గద్వాల జిల్లా

నేల దిగిన చుక్కలు



పాలమూరు నగరంలో శనివారం పొద్దుపోయాక ఆకాశం నీలి రంగును పులుముకున్నది.. సూర్యుడు జారుకుని, చీకటి పడటంతో చుక్కలు నేల దిగినట్లు లైట్లు వెలుగులీనాయి. నగరంలోని ఏనుగొండ సాంబశివాలయం నుంచి కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' శనివారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

ఆ తండ్రి తపన అనంతం



నిత్యం కష్టిస్తే తప్ప పూట గడవని పేద కుటుంబం. ఆపై కండరాల బలహీనతతో పుట్టిన కుమారుడు... 27 ఏళ్లుగా పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ.. సెలవు దొరక్క ఉద్యోగాన్నే వదిలేశాడా తండ్రి.. పదిహేను ఏళ్లుగా కొడుకు కోసం అన్నీ తానై తండ్రి పడుతున్న తాపత్రయం మాటల్లో చెప్పలేనిది. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం సోలాన్‌లో 45 రోజులు మస్క్యులర్ డిస్ట్రోఫీసేవలు చేయించాడు.. తానే నిత్యం భుజాలపై వేసుకొని పాఠశాలకు వెళ్తూ కన్న కొడుకు కోసం చేస్తున్న సేవలు అందరికీ స్ఫూర్తిదాయకం. కన్న కొడుకు సేవల ముందు తన కాయకష్టం ఏమీ లేదని.. తన కుమారుడు బసవ కార్తీక్ ఆరోగ్యం కొంత కాలమైనా కుదుట పడటమే ముఖ్యం అంటున్నాడు ఆ తండ్రి నర్సింహులు. కొడుకు ఆరోగ్యం కోసం వైద్య ఖర్చులకై ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తోంది ఆ కుటుంబం. ఫాదర్స్ డే (జూన్ నెలలో మూడో ఆదివారం) సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- పుట్టుకతోనే కండరాల బలహీనతతో కొడుకు
- పదిహేను ఏళ్లుగా కొడుకు సేవలో తండ్రి
- నిత్యం పాఠశాలకు భుజంపై కొడుకును ఎత్తుకుని వెళ్తూ.. చదివిస్తూ..
- అరుదుగా వచ్చే మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధి
- అయినా నిరాశ చెందకుడా హోమియోపతితో వైద్యసేవలు
- హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం సోలాన్‌లో 45 రోజులు మస్క్యులర్ డిస్టోఫీ సేవలు
- నేడు ఫాదర్స్ డే (జూన్ నెలలో మూడో ఆదివారం)





హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం సోలాన్‌లో మస్క్యులర్ డిస్ట్రోఫీ సేవలు అందుకుంటున్న బసవకార్తీక్

నారాయణపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మునిసిపాలిటీ పరిధిలోని 18వ వార్డు మూల హనుమాన్ దేవాలయ సమీపంలో ఇరుకైన గదిలో నివాసం ఉంటున్న డి.నర్సిములు, తిరుపతమ్మ దంపతులకు 2010, మే 16న కుమారుడు బసవకార్తీక్ జన్మించాడు.

నాలుగేళ్లు అయినా కొడుకు నడవక పోవడంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లగా పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యులు పుట్టుకతోనే కండరాల బలహీనత ఉందని తేల్చి చెప్పారని తండ్రి నర్సింహులు 'ఆంధ్రజ్యోతి'తో కంటతడి పెడుతూ చెప్పుకొచ్చారు. కండరాల కణజాలంలో సరైన ప్రోటీన్లు ఉత్పత్తికాక సంభవించే మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధిగా గుర్తించి.. ఇందుకు ఇక్కడ ట్రీట్‌మెంట్ లేదని వైద్యులు చెప్పారన్నారు. ఇలాంటి కేసులు చాలా అరుదని చెప్పడంతో కన్నకొడుకు తమకు భారం కాదని కొన్నాళ్లు హోమిహో వైద్య సేవలు హైదరాబాద్‌లో అందించామన్నారు.

తర్వాత నారాయణపేటలో అమ్మిరెడ్డిపల్లికి చెందిన హోమియో డాక్టర్స్ హరీశ్వర్‌రెడ్డి, శ్వేతారెడ్డి దంపతులు మూడేళ్లుగా తనకు ఉచితంగా హోమియో వైద్యసేవలు, మందులు అందిస్తున్నారన్నారు. నిత్యం ఇంటికి దగ్గర లో ఉన్న పాఠశాలకు తన భుజాలపై ఎత్తుకుని వెళ్లి విడిచి పెట్టి.. సాయంత్రం తీసుకువస్తానని తెలిపారు. మూడవ అంతస్తు తరగతి గదికి వెళ్లేందుకు భుజాల పై ఎత్తుకొని వెళ్తానన్నాడు.

నిలిచేందుకు సైతం తన సహాయంతో రెండు మూడు అడుగులు వేస్తాడు. ప్రస్తుతం బసవకార్తీక్ పదో తరగతి చదువుతున్నాడని వివరించారు. కూర్చుంటే లేవడానికి రాదు.. నడవడానికి ప్రయత్రించినా ఐదు అడుగులు వేస్తే పడిపోతుంటాడు. అలాంటి కొడుకును ఎలాగైన కొంతకాలం బతికించుకోవాలనే తాపత్రయంతో గత ఏప్రిల్‌లో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం సోలాన్‌లో 45 రోజులు మస్క్యులర్ డిస్ట్రోఫీ సేవలు చేయించినట్లు చెప్పుకొచ్చారు.

27 ఏళ్లుగా పేటలోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుండగా.. కొడుకు వైద్యం కోసం 45 రోజులు సెలవు ఇవ్వక పోవడంతో ఆ ఉద్యోగం సైతం వదిలివేసినట్లు తెలిపారు. కొడుకు కోసం తండ్రి పడ్తున్న పాట్లు వర్ణనాతీతం. ఆ నిరుపేద కుటుంబం ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తోంది. స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వం చేయూత అందించి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి, అన్నివిధాలుగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి నీటిమడుగులో పడి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి చేపల వేటకు వెళ్లి నీటిమడుగులో పడి మృతి చెందిన సంఘటన దేదినేనిపల్లి గ్రామంలో శనివారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం దేదినేనిపల్లి గ్రామానికి చెందిన బోయ మీనుగ లక్ష్మయ్య (52) అనే వ్యక్తి గ్రామ సమీపంలోని ఉప్పలబావికుంట మడుగులో చేపల కోసం శుక్రవారం మధ్యాహ్నం వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి ఊపిరాడక చనిపోయాడు. చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాకపోవడంతో శనివారం వెతక గా ఉప్పల బావిమడుగు దగ్గర మృతుని బట్టలు ఉండటంతో మడుగు నీటిలో ఉన్న మీనుగ లక్ష్మయ్య మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ సంఘటన పై మృతుని కుమారుడు మీను అశోక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వి.సతీష్ తెలిపారు. మృతునికి భార్య అలివేల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఈత రాక..

కోస్గి రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ఈత రాక వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండల పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకొంది. శనివారం స్థానిక ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా కురుమల్ల పూడి గ్రామానికి చెందిన ద్యవర్ల రాజశేఖర్(32) కోస్గి మండలం కొత్తపల్లి గ్రామంలో చెరువు దగ్గర తూము పనుల కోసం గత రెండు నెలలుగా గ్రామంలో ఉంటున్నాడు. ఈ నెల 13న సాయంత్రం కొత్తపల్లి చెరువులో చేపలు పట్టడానికి చెరువులోకి వెళ్లగా ప్రమాదవశాత్తు చేపల వల కాళ్లకు తట్టుకొని బురదలో ఇరుక్కుపోయి ఈత రాక చనిపోయాడు. మృతుని భార్య ద్యవర్ల స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

వెల్దండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో శుక్రవారం రాత్రి హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని మండల కేంద్రానికి చెందిన జీవరత్నం (70) అనే వృద్ధుడు మృతి చెందాడు. జీవరత్నం గత కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో రోడ్లపై తిరిగేవాడు. ఈ క్రమంలో రోడ్డుపై వెళుతున్న అతన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

మదనాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వే క్వార్టర్స్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు(42)వృత్తి రీత్యా పెయింటర్. గత వారం రోజుల నుంచి కనిపించ కపోవడంతో పెయింటింగ్ పని మీద వెళ్లాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. శనివారం రైల్వే క్వార్టర్స్ వద్ద దుర్వాసన రావడంతో అక్కడి కి వెళ్లి చూడగా పూర్తిగా కుళ్లిపోయిన శవం కనిపించింది. పోలీసులు అక్కడికి చేరుకుని మృతుని దుస్తులలో ఉన్న ఆధారాలతో మృతుడు శ్రీనివా సులు అని నిర్ధారించారు. మృతుని భార్య హారిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిమిత్తం ఆత్మకూర్ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

కొల్లాపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం యన్మన్‌బెట్ల గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ వైర్లు తెగి పడటంతో ఊర్లో పొలంలో మేత కు వెళ్లిన పాడి గేదె మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన గణాలు వెంకటయ్యకు చెందిన పాడి గేదె మృత్యువాత పడింది. పశువుల మంద తో మేతకు వెళ్లిన పాడి గేదె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమను ప్రభుత్వం స్పందించి న్యాయం చేసి ఆదుకోవాలని బాధితుడు వెం కటయ్య కోరారు.

విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి

మిడ్జిల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మిడ్జిల్ మండలంలోని వేముల గ్రామంలోని రైతు రామకృష్ణకు చెందిన పాడి ఆవు విద్యుదాఘాతానికి గురై శనివారం సాయంత్రం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు కిందకు వేలాడుతుండటంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అటుగా వెళ్లిన ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతి చెందిన ఆవు ధర సుమారు 50వేల రూపాయల వరకు ఉంటుందని, రైతు రామకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరుతున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కేటీదొడ్డి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని మల్లాపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన కంబ య్య (40) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటి సమీపంలో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

సఫారీ పర్యాటకులకు కనువిందు

- కనిపించిన నాలుగు చిరుతలు, ఒక పెద్దపులి



గుండం అటవీ ప్రాంతంలో రోడ్డుపై పులి

మన్ననూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ అభయారణ్యా ప్రాంతంలో సఫారీ టూర్ వెళుతున్న టూరిస్టులకు కనువిందు గొలిపేలా నాలుగు చిరుతలు, ఓ పెద్దపులి కనిపించాయి. వేర్వేరుగా శనివారం వీటి దర్శన భాగ్యం కలిగింది. శనివారం ఉదయం షికారీ ఘర్ ప్రాంతంలో ఓ పెద్దపులి కనిపించగా, సాయంత్రం నాలుగు చిరుత పులులు కనిపించాయి. చిరుత పులులను చూసిన పర్యాటకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తమ ఫోన్లలో చిరుత పులులు సంచరించే వీడియోలను చిత్రీకరించుకొని సంబరపడిపోయారు. శనివారం సాయంత్రం కనిపించిన నాలుగు చిరుత పులులు ఫర్హాబాద్ నుంచి గుండం వెళ్లే దారిలో వేర్వేరుగా కనిపించినట్లు అటవీ సెక్షన్ అధికారి శ్రీకాంత్ తెలిపారు.

పెద్దపులిని ప్రత్యక్షంగా చూసి..

అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో శనివారం ఉదయం సఫారీ పర్యాటకులకు పెద్దపులి కనిపించి కనువిందు చేసింది. ఫర్హాబాద్ చౌరస్తా నుంచి సఫారీ వాహనంలో వ్యూ పాయింట్ వైపు వెళుతున్న పర్యాటకులకు పాత నిజాం నవాబు బంగ్లా (శిఖారి ఘర్) వద్ద రహదారిపై దర్జాగా నడుచుకుంటూ వెళుతున్న పెద్దపులి ప్రత్యక్షమైంది. పెద్దపులిని గమనించిన సఫారీ డ్రైవర్ వాహనాన్ని నిలిపివేసి పర్యాటకులకు చూయించాడు. పర్యాటకులు ఓ వైపు భయం, మరో వైపు సంతోషంతో తమ వద్ద ఉన్న ఫోన్‌లో పెద్దపులి సంచరించే దృశ్యాలను చిత్రీకరించారు. పర్యాటకులతో పాటుగా, అటవీ అధికారులు సైతం పెద్దపులి సంచరించే దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లోకి పంపించుకున్నారు. మూడు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో చిరుతపులి సఫారీ టూర్‌కు వెళ్లే పర్యాటకులకు కనిపించగా, తాజాగా శనివారం ఉదయం అదే ప్రాంతంలో పెద్దపులి కనిపించింది.

ఇటీవలి కాలంలో నల్లమలలో తరచూ వర్షాలు కురవడంతో అడవిలో చెట్లన్నీ ఆకుపచ్చగా మారాయి. ఎండ వేడి తగ్గి వాతావరణం చల్లబడటంతో ఉదయం, రాత్రి వేళల్లో ఓ వైపు పెద్దపులులు, మరోవైపు చిరుత పులులు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధం చేయడం, వన్యప్రాణుల సంరక్షణపై అటవీ శాఖ ప్రత్యేక దృష్టి సారించగా పెద్దపులులు, ఇతర వన్యప్రాణుల సంఖ్య ప్రతీ ఏటా క్రమేపీ పెరుగుతోంది.

పెద్దపులులకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు సంతానోత్పత్తి జరిపే సమయం కానుండటంతో అడవిలో తరచూ పెద్దపులు లు, చిరుతలు సంచరిస్తున్నాయి. నల్లమలలో ఊటి మాదిరి వాతావరణం, పెద్దపులిని చూడొచ్చన్న ఆశతో నల్లమల టైగర్ సఫారీకి వచ్చే పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

వేగం పుంజుకున్న జల విద్యుత్ ఉత్పత్తి



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వరద కొనసాగుతున్న కారణంగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 9 యూనిట్లను ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్లు ప్రారంభించి 1.666 ఉత్పత్తి చేపట్టగా దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 4 యూనిట్లు ప్రారంభించి 1.919 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని రాబట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో చేపట్టిన ఉత్పత్తి 39 మిలియన్ యూనిట్లకు చేరుకుందని తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే నిర్దేశించిన 610 మిలియన్ యూనిట్లను చేరుకుంటామని ఆయన తెలిపారు.

తెలంగాణలో బీజేపీ వస్తే కాంగ్రెస్ ఖతం

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు

గద్వాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఒక్కసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే కాంగ్రెస్ పార్టీ కనుమరుగు అవుతుందని బీజేపీ పాలనలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. శనివారం డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో 18 నెలల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ఇక వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. దేశంలో 11ఏళ్ల బీజేపీ పాలనతో దేశం అభివృద్ధి చెందుతున్నదని ఆయన వివరించారు. 2004 నుంచి 2014 వరకు యూపీఏ పాలన సాగిందని, అప్పుడు అన్ని స్కామ్‌లే జరిగాయని పె ద్ద ఎత్తున అవినీతి జరిగి నల్లడబ్బును పోగేసుకున్నారని విమర్శించా రు. కానీ 2014 నుంచి 11ఏళ్లుగా బీజేపీ ప్రభుత్వంలో ఏ ఒక్క స్కామ్, అవినీతిని చూపిస్తారా...? అని ప్రశ్నించారు.

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ఇన్‌చార్జి డీకే స్నిగ్దారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎగ్బోటే, జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట్రాములు, అక్కల రమాదేవి, ఓబీసీ రాష్ట్ర మోర్చా ఉపాధ్యక్షుడు సరేందర్ యాదవ్ పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, జిల్లా ఓబీసీ అధ్యక్షులు దేవదాస్, నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్ సకురా సైన్స్ ప్రోగ్రామ్‌కు

పేట జిల్లా వాసి

- జాతీయ స్థాయిలో సత్తా చాటిన శివారెడ్డి
- నేటి నుంచి 21 వరకు జపాన్‌లోని.. టాప్‌యూనివర్సిటీలో పర్యటన



శంషాబాద్ విమానాశ్రయంలో జపాన్ పర్యటనకు వెళ్తున్న పేట జిల్లా విద్యార్థి శివారెడ్డిని అభినందించి వీడ్కోలు పలుకుతున్న గురుకుల గైడ్ టీచర్ జరీనా

నారాయణపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సైన్స్ పరిశోధనలో సత్తా చాటిన ముగ్గురు తెలంగాణ విద్యార్థుల్లో ఒకరు నారాయణపేట జిల్లా విద్యార్థి శివారెడి. ఆయన జపాన్ పర్యటనకు శనివారం బయలుదేరారు. జాతీయ స్థాయిలో 54 మంది ఎంపిక కాగా అందులో నారాయణపేట జిల్లా దామరగిద్ద సాంఘీక గురుకులంలో చదివిన విద్యార్థి శివారెడ్డి ఒకరు. ఆదివారం నుంచి 21 వరకు జపాన్‌లోని టాప్ యూనివర్సిటీలో పర్యటించనున్నారు.

అంతర్జాతీయ సైన్స్ వేదిక జపాన్ సకురా పర్యటనకు శివారెడ్డికి ఈ అరుదైన అవకాశం రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. గురుకుల గైడ్ టీచర్ జరీనా శంషాబాద్ విమానాశ్రయంలో జపాన్‌కు వెళ్తున్న విద్యార్థి శివారెడ్డికి అభినందనలు తెలిపి వీడ్కోలు పలికారు. ఉదయం 7.30 గంటలకు ఢిల్లీకి వెళ్లిన శివారెడ్డి మినిస్టరీ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ సమావేశంలో పాల్గొని సాయంత్రం 7 గంటలకు జపాన్ పర్యటనకు ఢిల్లీ నుంచి బయలుదేరాడు.

కాగా, 2024, సెప్టెంబర్17,18,19 తేదీల్లో ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరిగిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డు వైజ్ఞానిక ప్రదర్శనలో నారాయణపేట జిల్లాకు చెందిన శివారెడ్డి కోకోనట్ ఫైబర్ పోట్స్(కొబ్బరి పీచు, మైదా పిండితో పూల మొక్కల కుండీల త యారీ) అనే అంశం జాతీయ స్థాయిలో ఎం పికైంది. జాతీయ స్థాయిలో మొత్తం 137 ప్రాజెక్టులలో ఎంపికైనవి తెలంగాణ రాష్ట్రం నుంచి నాలుగు ఉండగా, జిల్లా నుంచి ఒకటి ఎంపిక కావడం విశేషం.

ఇంటర్వ్యూ..

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- చంద్రుడు, ఎంఈవో, వెల్దండ



వెల్దండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాశాఖాధికారి చంద్రుడు అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి?

మండలంలో 50 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 7 జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, మోడల్, ఎస్సీ గురుకుల, ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయి.

ఏవైనా పాఠశాలలు మూతపడ్డాయా ?

విద్యార్థులు లేకపోవడంతో కేస్లీతండా,నెమలిగుట్టతండా, బద్రిగానితండా, కళ్యాణవాగుతండా, బుగ్గకాల్వతండా, బుడ్డోనిపల్లి, కంటోనిపల్లి, అంకమోనికుంట పాఠశాలలు మూతపడ్డాయి. ఈ సారి ఆయా పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాము. బడిబాటలో భాగంగా విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాము.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

మన ఊరు - మనబడి, అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో 17 పాఠశాలలకు మౌలికవసతులు కల్పించేందుకు రూ.లక్ష చొప్పున మంజూరయ్యాయి. అదేవిదంగా ఫ్లడ్ స్కూళ్లలో భాగంగా శిథిలావస్థలో ఉన్న రాచూరు, వెల్దండ బాలికల ఉన్నత పాఠశాల, లింగారెడ్డిపల్లి పాఠశాలలకు రూ.2 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రగతిలో ఉన్నాయి.

విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందాయా ?

మండలంలోని అన్ని పాఠశాలలకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు ఇస్తున్నాము. స్కూల్ యూనిఫాంలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము.

న్యూస్ బాక్స్

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ

కల్వకుర్తి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కుర్మిద్దతండా, జీడిపల్లితండా, జగ్గారెడ్డిపల్లి గ్రామాల్లో గర్భిణులకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన మెడికల్ కిట్లును ఆయా తండాలు, గ్రామాల్లో గర్భిణులకు శనివారం నాయకులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు హనుమంతునాయక్, రామునాయక్, లక్ష్మణ్‌నాయక్, పులియనాయక్, సేవ్యనాయక్, శక్రునాయక్, కమలమ్మ, శాంతి, సరోజా, శోభా, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో అన్ని కోర్సులు ఏర్పాటు చేయాలి : బీఆర్ఎస్‌వీ

కొల్లాపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు అయిన కస్తూర్బా జూనియర్ కళాశాలలో జనరల్ కోర్సులతో పాటు ఒకేషనల్ కోర్సులను కూడా నెలకొల్పాలని బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు శేఖర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని కార్పొరేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని కోరారు.

రైతు భరోసా వెంటనే చెల్లించాలి : టీడీపీ

ఉప్పునుంతల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు రైతు భరోసాను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు రేవల్లి కాశన్న శనివారం ఒక ప్రకటనలో కోరారు. వానాకాలం ప్రారంభమై పది రోజులు కావస్తున్నా నేటికీ ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయడంలేదని ఆయన విమర్శించారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

పెద్దకొత్తపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి మాతృమూర్తి ఆదెర్ల లక్ష్మీదేవమ్మ శనివారం ఉదయం అకాల మరణం చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండు నరసింహ, మాజీ సర్పంచ్‌లు వి.సత్యం, పి.చిన్నయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యులు మేకల గౌరమ్మ చంద్రయ్యయాదవ్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, ఆదెర్ల లక్ష్మీదేవమ్మ పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైద్య శిబిరం విజయవంతం

కల్వకుర్తి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మాజీ కౌన్సిలర్ షేక్ ఎజాస్ జన్మదినం సందర్భంగా శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. శిబిరంలో దాదాపు ఓపీ 280మంది హాజరయ్యారు. అందులో గుండు, కంటికి, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు ప్రముఖ వైద్యులు డాక్టర్ యశోదబాయితోపాటు పలువురు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగానే మందులను అందజేశారు. అనంతరం మాజీ కౌన్సిలర్ షేక్ ఎజాస్‌ను పలువురు పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. వైద్య శిబిరంలో పలు ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి



మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ మల్లు రవి, పక్కన మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మహిళల సంక్షేమం కోసం పనిచేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కుట్టు మిషన్లను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముస్లిం మైనార్టీ మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ మా మిళ్లపల్లి విష్ణువర్ధన్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ఆయన పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, యువత ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా వారికి త్వరలో రుణాలు మంజూరు చేసి ఉపాధి కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో దాదాపు 39వేల సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేసి రైతులకు అదనంగా ఆదాయవనరులు కలిపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రమాకాంత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి డీ రమాకాంత్

కందనూలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రాజీమార్గమే రాజమార్గమని, జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రమాకాంత్ అన్నారు. హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. సివిల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, బ్యాంకుకేసులు, పెట్టి కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీమార్గమే రాజ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే సమయాభావం, ఖర్చులు, ఆదా అవుతాయన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ డిస్ట్రిక్ట్ సెక్రటరీ నసీమా సుల్తానా మాట్లాడారు. ఈ లోక్ అదాలత్ ద్వారా 17,495 కేసులు పరిష్కారమయ్యాయి. కాంపౌండింగ్ ఫీజు 58,37,519 వసూలు అయ్యింది. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కుమారి ఎన్.శ్రీనిధి, అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, బార్‌అసోసియేషన్‌రవి, కాంతారావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీస్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో 931 కేసుల పరిష్కారం

కొల్లాపూర్ : కొల్లాపూర్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో కొల్లాపూర్, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, కోడేరు మండలాలకు చెందిన 931 కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించారు లోక్ అదాలత్ బెంచికి చైర్మన్‌గా ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి దమ్ము ఉపనిషద్వాణి, సభ్యులుగా కురుమూర్తి, మోహన్‌లాల్ వ్యవహరించారు. లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా 37కేసులు, అపరాధ రుసుము ద్వారా 9 కేసులు, 1 ఎక్సైజ్ కేసు కంపౌండింగ్ ఫీజు విధించి సైబర్ క్రైమ్ కేసులు 6, ద్వితీయ శ్రేణి కోర్టుకు సంబంధించిన 878 కేసులలో అపరాధ రుసుము విధించి పరిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏపీపీ శిరీష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల నాగరాజు, భాస్కర్‌రెడ్డి, వసంతరెడ్డి, నిరంజన్, కుర్మయ్య, శ్రీహరి, బాలస్వామి, రామలక్ష్మమ్మ, రేణుక, రాజు, సిబ్బంది భోగ హరికృష్ణ, పోలీసు సిబ్బంది, 3 కోర్టుల సిబ్బంది హాజరయ్యారు.

మెగా లోక్ అదాలత్ విజయవంతం

కల్వకుర్తి : కల్వకుర్తి పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్ విజయవంతమైంది. లోక్‌అదాలత్‌లో సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి, జూనియర్ సివిల్ న్యాయాధికారి కావ్య 819 కేసులు పరిష్కరించారు. 723 కేసుల్లో సుమారు రూ.2,63,490 విలువ గల కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో కల్వకుర్తి, వెల్దండ సీఐలు, కోర్టు పరిధిలోని ఎస్ఐలు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ఉన్నారు.

ప్రధాని మోదీతో ప్రజారంజక పాలన

- బీజేపీ రాష్ట్ర నాయకుడు మండికారి బాలాజీ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు మండికారి బాలాజీ

కల్వకుర్తి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజారంజక పాలన కొనసాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు మండికారి బాలాజీ అన్నారు. దేశంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చి 11ఏళ్ల పూర్తైన సందర్భంగా ఆ పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమం శనివారం కల్వకుర్తిలో నిర్వహించారు. బాలాజీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు కల్వకుర్తి పట్టణంలోని బీజేపీ కార్యాలయం ఆవరణలో కల్వకుర్తి బీజేపీ మండల అధ్యక్షుడు మట్ట నరేష్ గౌడ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. బాలాజీ మాట్లాడుతూ దేశంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన 11ఏళ్లల్లో అన్ని రంగాల్లో అగ్రగ్రామిగా దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బండల రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యకృష్ణగౌడ్, నాయకులు శేఖర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, శ్రీశైలం, శ్యాంసుందర్, రవీందర్‌రెడ్డి, మల్లేష్, లింగారెడ్డి, సైదులుగౌడ్, రాజురెడ్డి, కరుణరెడ్డి, సురేష్‌గౌడ్, కిరణ్‌రెడ్డి, సంతోష్‌నాయక్, శివసేన, ఆనంద్, ఆంజనేయులు, విజయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రిని కలిసిన వట్టిపల్లి కాంగ్రెస్ యువ నాయకులు



మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసిన వట్టిపల్లి కాంగ్రెస్ యువ నాయకులు

తెలకపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గనులు, కార్మిక, ఉపాధి శిక్షణ పరిశ్రమల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని శుక్రవారం తన నివాసంలో వట్టిపల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శేఖర్ మాస్టర్ మర్యాద పూర్వకంగా కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

కాంట్రాక్ట్ సీఆర్‌టీల కోసం దరఖాస్తు చేసుకోవాలి

- ప్రత్యేక అధికారి సుజాత

తిమ్మాజిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బోధించేందుకు కాంట్రాక్ట్ సీఆర్‌టీల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి సుజాత అన్నారు. ఇంటర్మీడియట్‌లో సీఈసీ కోర్సుతో పాటుగా ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇంగ్లిష్‌లో బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులు బోధించడానికి నియామకాలు జరుగుతున్నాయని, అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

తెలుగుపల్లి కేజీబీవీలో...

అమ్రాబాద్ : మండల పరిధిలోని తెలుగుపల్లి (కేజీబీవీ) కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని (అప్‌గ్రేడ్ చేసి) జూనియర్ కళాశాల కోర్సులు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ) జి. శారద తెలిపారు. శనివారం అమ్రాబాద్‌లో ఎస్‌వో శారద విలేకరులతో మాట్లాడారు. కేజీబీవీలో ఇంటర్మీడియట్‌కు అప్‌గ్రేడ్ చేసినందున సీఈసీ (40) మంది విద్యార్థులు అకౌంటింగ్ టాక్సేషన్ (40) విద్యార్థులకు గాను కోర్సులను ప్రవేశపెట్టిందని ఆమె తెలిపారు. ఇంటర్మీడియట్ తరగతులను (మహిళ గెస్ట్ లెక్చరర్లు) బోధించడానికి సీఈసీలో (5)తెలుగు, ఇంగ్లిష్, ఫిజిక్స్, ఎకనామిక్స్ కామర్స్ పీజీ పట్టభద్రులు, అకౌంటింగ్ టాక్సేషన్ (1) బోధించడానికి ఇంజనీరింగ్ పీజీ పట్టభద్రులు 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ శారద వెల్లడించారు.

మెడికల్ కాలేజీలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

కందనూలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్, బ్లడ్ బ్యాంక్, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సంయుక్తంగా శనివారం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 36మంది ఎంబీబీఎస్ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు గుర్తింపుగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమాదేవి ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడినవారవుతారని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి : సీపీఐ

పెద్దకొత్తపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు పార్టీ శ్రేణులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోల ఏసయ్య, పెబ్బేటి విజేయుడు పిలుపునిచ్చారు. పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలో శనివారం సీపీఐ శాఖ మహాసభ జరిగింది. ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏసయ్య, పెబ్బేటి విజేయుడు మాట్లాడారు. సీపీఐ గ్రామ శాఖ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శి కృష్ణయ్య, సహాయ కార్యదర్శులు కర్తాల ప్రకాశ్, పూజారి వేఖర్, కోశాధికారి సంపుం బాలస్వామి, కమిటీకి సలహాదారు లక్ష్మీనారాయణ, గౌరవ సలహాదారు చింతపల్లి కుర్మయ్యతో పాటు 16 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సీపీఐ మం డల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, కుర్మయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వెల్దండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన మల్కేడి శ్రీనుకు చికిత్స నిమిత్తం రూ.51వేల ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరయ్యింది. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన చెక్కును కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ లబ్దిదారునికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, తిరుపతి, రాములు, ప్రవీన్, అజారుద్దీన్, కృష్ణయ్య, అంజయ్య, లక్ష్మయ్య, సుధాకర్ ఉన్నారు.

తెగిపడిన 33/11కేవీ విద్యుత్ తీగలు

- తప్పిన పెనుప్రమాదం

- ఆగిన జకినాలపల్లి ఫీడర్ విద్యుత్ సరఫరా

- పునరుద్ధరించిన విద్యుత్ సిబ్బంది

కల్వకుర్తి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో 33/11కేవీ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు ఇళ్లపై తెగిపడి పెను ప్రమాదం తప్పిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు స్థానికుల కథనం ప్రకారం.. కల్వకుర్తి పట్టణంలోని పదవ వార్డు పరిధిలో టీఎన్‌జీవో కాలనీ, వడ్డెర బస్తీ ఇళ్లమధ్య ఉన్న 33/11(జక్కినాలపల్లి ఫీడర్) విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తెగి పడ్డాయి. పాఠశాలలకు సెలవు దినం కావడంతో వడ్డెర బస్తీకాలనీలోని పిల్లలు బయటకు వచ్చి ఆడుకుంటుండగా ఒక్కసారిగా విద్యుత్‌తీగలు తెగి శబ్దం రావడంతో స్థానికులు భయంతో ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. షార్ట్‌సర్క్యూట్‌తో ఇళ్లలో ఉన్న టీవీలు, రిఫ్రిజిరేటర్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాల నుంచి 33/11కేవీ విద్యుత్ తీగలు ఇళ్లపై నుంచి వెళ్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 11కేవీ తీగకు ఎవరో రాడ్డుతో కొట్టి ఉండవచ్చునని విద్యుత్ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. కరెంటు సరఫరా వెంటనే నిలిచిపోకపోతే ప్రాణ నష్టం జరిగి ఉండేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలు తెగి పడటంతో జక్కినాపల్లికి వెళ్లేవిద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే స్పందించిన ఊర్కొండ విద్యుత్ ఏఈ సంఘటన స్థలానికి చేరుకుని తీగలను పరిశీలించారు. తీగలను పునరుద్ధరించవద్దని ఇళ్లపై లేకుండా తీగలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు అడ్డుకున్నారు. సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని కాలనీవాసులకు ఏఈ నచ్చజెప్పారు. దీంతో విద్యుత్ సరఫరా కోసం వైర్లను పునరుద్ధరించారు. ఏదేమైనా విద్యుత్ తీగలు తెగిపడ్డసమయంలో వెంటనే కరెంటు సరఫరా నిలిచిపోకపోతే ప్రాణ నష్టం జరిగి ఉండేది.

తిరుమలలో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయాలి

- వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రమణ

మన్ననూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో 65ఏళ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ డిమాండ్ చేశారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు లేక సాధారణ దర్శనంతోనే సరిపెట్టుకుంటున్నారని వాపోయారు. ఈ విషయమై టీటీడీకి, అక్కడి కూటమి ప్రభుత్వానికి వీహెచ్‌పీ తరఫున సీనియర్ సిటిజన్స్ దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం చేయాలని డిమాండ్ చేస్తూ లేఖ రాయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఉమా మహేశ్వర ఆలయ పాలక మండలి డైరెక్టర్ సంభు శోభ, స్థానిక కాంగ్రెస్ నాయకులు రాజారాం నాయక్, శివాజీ, కొండపల్లి వెంకటయ్య, జూలూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే పోషకాహారం అందించాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ



అచ్చంపేటలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అచ్చంపేటటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచే పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ఐసీడీఎస్‌లు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని 5వ వార్డులో 'అమ్మమాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచే పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ఐసీడీఎస్‌లు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, ఉమామహేశ్వర దేవస్థానం చైర్మన్ మాదవరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు క్యామ మల్లయ్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ఉప్పునుంతల : మండల పరిధిలోని ఈర్వటోనిపల్లి గ్రామంలో గుండమోని నారయ్య (50) గుండెనొప్పితో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి, రంగారెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎగ్ బిర్యానీ

పదర : మండలంలోని వంకేశ్వరం గ్రామ 4వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు ఎగ్ బిర్యానీ వడ్డించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు, ఆయాలు స్వాగతం పలికారు. గ్రామస్థులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలకు పురస్కారంపై హర్షం

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి



హైదరాబాద్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర స్థాయిలో రికార్డు రక్తదాన నిధిని సేకరించి అవార్డును పొందడం హర్షణీయమని నాగర్‌ర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినం సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్‌కు రాష్ట్రస్థాయి అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ చేతుల మీదుగా ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి రెడ్‌క్రాస్ అవార్డును స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా రెడ్‌క్రాస్‌కు రాష్ట్ర స్థాయిలో అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

- కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్



కల్వకుర్తిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరయ్యేలా చూస్తామని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ తెలిపారు. గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి మునిసిపాలిటీలోని 7వ వార్డులోని హనుమాన్‌నగర్, గాజులవాడ, అంబేద్కర్ నగర్ కాలనీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శనివారం మాజీ కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులుతో కలిసి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ భూమి పూజచేశారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ శ్రీలత, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు జ్యోతి, మాజీ కౌన్సిలర్లు లక్ష్మి, చిన్నరాంరెడ్డి, నేరటి పద్మ, చిన్న, బాలునాయక్, నాయకులు బృంగి ప్రవీణ్, వర్కాల భాస్కర్‌రెడ్డి, మబ్బు సాయిలు, చంద్రకాంత్‌రెడ్డి, జమ్ముల శ్రీకాంత్, రావుల శ్రీనివాసులు, రేష్మాబేగం, ఝాన్సీ జ్యోతి, గంగావతి, రాహుల్, పర్వపాకుల శేఖర్, సైదులు యాదవ్, ఆంజనేయులు, కార్తీక్, తరుణ్, పరశురాములు, షమీం, రియాజ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ చత్రునాయక్



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేటటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠినం గా శిక్షించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ చత్రునా యక్ కోరారు. శనివారం స్థానిక పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనుభవ్ గుప్తాపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కుంద మల్లికార్జున్, మునిసిపల్ కౌన్సిలర్ గౌరీశంకర్, నాయకులు లక్ష్మణ్, పవన్, ఖాదర్, రఫీ, కృష్ణ, వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

వంగూరు : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన అనుభవ్ గుప్తాపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.

చేగువేరా స్ఫూర్తితో పోరాడుతాం

- డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మధు



జిల్లా కేంద్రంలో చేగువేరా చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : విప్లవ ధ్రువతార చేగువేరా స్ఫూర్తితో సామ్రాజ్యవాదంపై పోరాటాలు చేస్తామని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగపూర్ మధు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో చేగువేరా 97వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బస్టాండు కూడలిలో ఏర్పాటు చేసిన చేగువేరా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ క్యూబా దేశాన్ని సామ్రాజ్యవాదుల నుంచి విముక్తి కలిగించిన చేగువేరా అంతర్జాతీయ మానవతావాది అని కొనియాడారు. చేగువేరా పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని దేశంలో సామ్రాజ్యవాదంపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు మల్లికార్జున్, నవీన్, రాజు, శ్రీను, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపూర్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రశాంత్, బృందం

అచ్చంపేట రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చంపేట మండలం సిద్ధాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్ ప్రజలను కోరారు. శనివారం ఫ్రైడే సందర్భంగా సిద్ధాపూర్ గ్రామంలో స్థానిక వైద్య బృందంతో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరస్ లాంటి విషజ్వరాలు రాకుండా అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానికులకు వివరించారు. గ్రామంలో వర్షాలు వల్ల ఏర్పడిన నీటి గుంతల్లో దోమలు వ్యాప్తి చెందకుండా మందులు చల్లించారు. ప్రతీ ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ ప్రజలను కోరారు. బాలింతలు, గర్భిణులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఫార్మా ఆఫీసర్ భగత్‌సింగ్, ఏఎన్ఎం అలివేల, హెల్త్ అసిస్టెంట్ కిషన్, నర్సులు పాల్గొన్నారు.